



బెలూన్‌లు ఎగురవేసి డ్యూటీ మీట్‌ను ప్రారంభిస్తున్న పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్

నైపుణ్యం, సామర్థ్యం పెంచేందుకే
డ్యూటీ మీట్

- తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశంలోనే టాప్
- ఆల్ ఇండియా 69వ డ్యూటీ మీట్‌లో ప్రతిభ కనబర్చాలి
- అదనపు డీజీపీ, టీజీపీఏ డైరెక్టర్ అభిలాష బిస్త్
- సాధనతోనే ఏదైనా సాధ్యం : అదనపు డీజీపీ మహేష్ భగవత్
- మామునూరు పీటీసీలో సందడిగా డ్యూటీ మీట్
- పాల్గొన్న 400 మంది పోలీసులు



అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

- ఇన్‌చార్జి డీఏవో శ్రీనివాసరావు



మహబూబాబాద్‌లోని ఓ ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న డీఏవో శ్రీనివాసరావు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే.. చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ జిల్లా వ్యవసాయాధికారి అజ్మీర శ్రీనివాసరావు హెచ్చరించారు. మహబూబాబాద్ పట్టణంలో గురువారం పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలైన నర్సింహా ఫర్టిలైజర్స్, మణికంఠ ఏజెన్సీ, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం (జమాండ్లపల్లి)లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ ఎరువుల కొరత లేదని ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని చెప్పారు. ఎరువుల నిల్వలు, ధరల పట్టిక రైతులకు కన్పించే విధంగా ప్రదర్శించాలని చెప్పారు. దుకాణాల్లో ఉన్న ఎరువుల నిల్వలను, స్టాక్ రిజిస్టర్లను ఈ-పాస్ మిషన్ బ్యాలెన్స్‌ను స్టాక్ బోర్డులపై రాసి వున్న నిల్వల వివరాలను బట్టి తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయాధికారి ఎస్.తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

డుమ్మా కొడితే.. ఇక అంతే..!

టీచర్లకు ముఖగుర్తింపు హాజరు

- నేటి నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్
- సర్కార్ బడుల్లో అమలుకు శ్రీకారం
- పేరెంట్స్‌లో నమ్మకం పెంచేలా ప్రభుత్వం చర్యలు
- పాఠశాల ఆవరణలోనే ఫేషియల్ అటెండెన్స్ వచ్చేలా ఏర్పాట్లు
- జిల్లాలో 3,604 మంది ఉద్యోగులు





మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు ఆగస్టు 1 నుంచి ముఖగుర్తింపు (ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్-ఎఫ్ఆర్ఎస్) హాజరు అమలు కానుంది. గత సంవత్సరం పైలెట్ ప్రాజెక్టు కింద పెద్దపల్లి జిల్లాలో ఇదే యాప్ ద్వారా టీచర్లందరూ సెల్ఫ్ అటెండెన్స్ పేరుతో ఎఫ్ఆర్ఎస్ తీసుకున్నారు. ఇది విజయవంతంగా అమలుకావడంతో, ఇదే విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుంచి అమలు చేసేందుకు స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు జిల్లా విద్యాశాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా విద్యాశాఖాధికారులు జిల్లాలోన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లోని ఉపాధ్యాయులందరు ఎఫ్ఆర్ఎస్‌ను పక్కాగా అమలుచేయాలని ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలోని అన్ని ప్రభుత్వ స్కూళ్లలో..

జిల్లాలోని 18 మండలాల పరిధిలో ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు- 901, మోడల్ స్కూల్‌లు-8, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు-16 మొత్తం - 935 ఉన్నాయి. వీటిల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియంలలో- 40,292 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో అన్ని కేటగిరీల ఉపాధ్యాయులు 3,604 మంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులకు కేవలం రిజిస్టర్ అటెండెన్స్ కొనసాగుతుంది. ఈ విధానంతో కొందరు ఉపాధ్యాయులు పాఠశాలకు రాకపోయినా మరుసటి రోజు వచ్చి అటెండెన్స్ వేసుకుంటున్నారనే అభిప్రాయం వ్యక్తమయ్యేది. పాఠశాల నిర్ణీత సమయానికంటే ఆలస్యంగా వచ్చిన వచ్చిన టీచర్లు కూడా రిజిస్టర్‌లో సంతకాలు పెట్టుకునేవారనే అపవాదు ఉండేది. దీనికి తోడు పలు గ్రామాల్లోని పాఠశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులకు బదులు విద్యావలంటీర్లను పెట్టి పాఠశాలలను నిర్వహిస్తున్నారని, కొందరు ఉపాధ్యాయులు నెలల తరబడి పాఠశాలలకు రాకపోయినా వేతనాలు తీసుకుంటున్న సంఘటనలు పలు జిల్లాల్లో వెలుగుచూశాయి. రాష్ట్ర వ్యాప్తంగా లక్షకు పైగా ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తుండగా కొందరు టీచర్లు చేసినా.. నింద మాత్రం ఉపాధ్యాయ వ్యవస్థపై పడింది. ఇలాంటి సమయంలో ప్రభుత్వ బడులపై తల్లిదండ్రులకు నమ్మకం మరింత సన్నగిల్లింది. ఈ అనుమానాలను చెక్‌పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

డీఎస్ ఈ-ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా..

ప్రతీ ఉపాధ్యాయుడు మొదటగా ఎఫ్ఆర్ఎస్ యాప్ నందు ముఖఃగుర్తింపు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఉపాధ్యాయుడు రోజు పాఠశాలకు వెళ్లిన వెంటనే తన ముఖం ఆధారంగా హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఫేసియల్ రికగ్నేషన్ యాప్ లేదా వెబ్ ప్లాట్‌ఫారమ్ ద్వారా ఈ ప్రక్రియ కొనసాగుతుంది. నిబంధనల ప్రకారం పాఠశాల ముగింపు సమయంలో కూడా ముఖః గుర్తింపుతో హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు ఈ ప్రక్రియను పర్యవేక్షణ చేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు డీఎస్ ఈ-ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా పాఠశాలలోనే ఫేషియల్ అటెండెన్స్ తీసుకుంటున్నారు.

పాఠశాల ఆవరణలోనే అటెండెన్స్..

ఇప్పటికే అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ తీసుకుంటున్నారు. ఫేషియల్ రికగ్నేషన్ సిస్టమ్ యాప్ ద్వారా ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలోనే అటెండెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో పాఠశాల బయట అటెండెన్స్ తీసుకునే అవకాశం లేకుండా పోతుంది. తద్వారా ఉపాధ్యాయులు పాఠశాలకు సమయానికి వచ్చే అవకాశం ఉంటుంది. ఇప్పటికే ప్రతీ పాఠశాలకు కంప్యూటర్లు, ట్యాబ్‌లు అందించారు. ఒకవేళ ఫోన్లలోని యాప్‌లో ఏమైనా సమస్య ఉంటే.. పాఠశాలల్లోని కంప్యూటర్లు, ట్యాబ్‌ల ద్వారా కానీ ఉపాధ్యాయులు అటెండెన్స్ తీసుకునేలా చర్యలు చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు.

పాఠశాలల బలోపేతానికి ఎఫ్ఆర్ఎస్ దోహదం



రవీందర్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎఫ్ఆర్ఎస్ దోహదపడుతుంది. ఇప్పటి వరకు విద్యార్థులకు మాత్రమే వర్తించే ఎఫ్ఆర్ఎస్ ఉపాధ్యాయులకు విస్తరించడం ద్వారా హాజరు ప్రక్రియలో పారదర్శకత, బాధ్యతాయుత, సమయపాలనను మరింతగా పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యం. ఉపాధ్యాయుల్లో శ్రద్ధ, నిత్యకార్యక్రమాల్లో నిబద్ధతను పెంపొందించేందుకు ఇది ఒక ముందడుగు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎఫ్ఆర్ఎస్‌ను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశాలిచ్చాం.

ఏ పథకం ప్రవేశ పెట్టినా అమలు చేస్తాం

మిర్యాల సతీష్‌రెడ్డి, పీఆర్టీయూ-టీఎస్ జిల్లా అధ్యక్షుడు, మహబూబాబాద్



పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల విద్యాభున్నతికోసం ప్రభుత్వ ఏ పథకం ప్రవేశ పెట్టినా ఉపాధ్యాయులుగా అమలుచేస్తాం. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో అనేక బోధనేతర పనులు ప్రవేశపెట్టినా వాటిని ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణీత సమయంలో పూర్తి చేస్తున్నాం. గతంలో ప్రభుత్వం ఉపాధ్యాయులకు వేలు ముద్రలు ప్రవేశపెట్టినా పాటించాం.. ఇప్పుడు కొత్తగా ఎఫ్ఆర్ఎస్‌ను కూడా అమలుచేసేందుకు ఎలాంటి సందేహం లేదు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్తి స్థాయిలో మౌళిక సదుపాయాలు కల్పించాలి.

నిద్రిస్తున్న బాలుడి మెడపై
కత్తితో దాడి

నారాయణపురంలో కలకలం



బాలుని మెడపై గాయం

కేసముద్రం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో నిద్రిస్తున్న ఆరేళ్ల బాలుడి మెడపై కత్తితో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన కేసముద్రం మండలం నారాయణపురంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితులు, గ్రామస్థులు తెలిపిన ప్రకారం. గ్రామానికి చెందిన పందుల ఉపేందర్-శిరీష దంపతులకు ముగ్గురు కుమారులు సంతానం. ఆరేళ్ల పెద్దకుమారుడు మునీష్‌కుమార్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. బాలుడి తల్లిదండ్రులు, నానమ్మతో కలిసి రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో గొళ్లెం వేయని తలుపును తెరుచుకొని గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించారు. బాలుని మెడపై కత్తితో కోసినట్లుగా గాయపర్చి పరారైనట్లుగా బాధితులు తెలిపారు. కొద్దిసేపటి తర్వాత బాలుడు చిన్నగా మూలుగుతుండడంతో తడిమి చూడగా మెడపై తడిగా ఉండడంతో నానమ్మ వెంటనే తన కుమారుడు ఉపేందర్‌ను లేపి పరిశీలించగా బాలుని మెడపై కత్తితో కోసినట్లుగా గాయం కనిపించింది. దీంతో బాలున్ని స్థానికంగా ప్రాథమిక చికిత్స చేయించి, జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలానికి ట్రైనీ ఎస్ఐ నరేష్, పోలీస్ సిబ్బంది చేరుకొని విచారణ చేపట్టారు. ఈ దంపతుల చిన్న కుమారుడు ఎనిమిది నెలల క్రితం సంప్‌లో పడి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మురళీనాయక్ మహబూబాబాద్ ఆస్పత్రిలో బాలున్ని పరామర్శించారు.

మిస్టరీగా మారిన ఘటన...

ఇదిలా ఉండగా బాలునిపై కత్తితో దాడి ఘటన మిస్టరీగా మారింది. తమ కుటుంబానికి ఎవరితో శతృత్వంలేదని బాధితులు చెబుతుండడంతో కేసు మరింత సంక్లిష్టంగా మారింది. ఎవరు, ఏ ఉద్దేశంతో బాలునిపై దాడి చేశారనేది చర్చనీయాంశంగా మారింది. పోలీసులు సాంకేతికతను ఉపయోగించి అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. త్వరలోనే ఈ కేసు మిస్టరీ విడిపోతుందని పోలీసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

'సంస్థాగతం'పై సన్నద్ధత ఏదీ?

గులాబీ కమిటీలు వేయక మూడేళ్లు..

- అన్ని జిల్లాలకు అధ్యక్షులు మాత్రమే నియామకం
- ఉమ్మడి ఆరు జిల్లాల కమిటీలకు కార్యవర్గాలే లేవు
- ఏడాదిన్నరగా వరంగల్ జిల్లా బీఆర్ఎస్‌కు అధ్యక్షుడు కరువు
- నియోజకవర్గ ఇన్‌చార్జి పదవుల కోసమే నేతల కొట్లాట
- క్యాడర్‌కు పార్టీ పదవులపై పట్టింపేదని శ్రేణుల్లో ఆందోళన
- స్థానిక ఎన్నికల నేపథ్యంలో కమిటీలు లేక నిరుత్సాహం
- అధిష్ఠానం దృష్టి సారించాలని కార్యకర్తల వేడుకోలు



▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

సంస్థాగతంగా బలోపేతంపై బీఆర్ఎస్ పార్టీ దృష్టి పెట్టడం లేదని క్యాడర్‌లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. నియోజకవర్గాల్లో ఇన్‌చార్జి బాధ్యతల కోసం నేతలు కొట్లాడుకుంటున్నారే కానీ.. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పార్టీ కమిటీలను ఏర్పాటు చేసేందుకు దృష్టి పెట్టడం లేదనే ఆవేదనలో గులాబీ క్యాడర్ ఉంది. ఎప్పుడో మూడున్నరేళ్ల కిందట నియమించిన అధ్యక్షులే పార్టీని నడిపించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక ఏడాదిన్నర కిందట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ రాజీనామాతో ఏర్పడిన వరంగల్ జిల్లా అధ్యక్షపదవి ఖాళీలో ఇప్పటివరకు ఎవరినీ నియమించకపోవటంతో గులాబీ శ్రేణులు నిరాశలో ఉ న్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్న నేపథ్యంలో పార్టీ కమిటీలు, అనుబంధ కమిటీలకు కార్యవర్గాలు లేకపోతే స్థానిక సమరాన్ని ఎదుర్కోవడం ఎలా అని క్యాడర్‌లో ఆందోళన నెలకొంది.

మూడున్నరేళ్లుగా పార్టీకి ఒకే ఒక్కడు

బీఆర్ఎస్‌కు మూడున్నరేళ్లుగా జిల్లా కార్యవర్గాలు లేవు. 2016 వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా తక్కళ్లపల్లి రవీందర్‌రావుతో పాటు కార్యవర్గం కూడా ఉంది. అయితే 2016 అక్టోబరు 11న ఉమ్మడి వరంగల్ జిల్లాను ఐదు కొత్త జిల్లాల ఏర్పాటు తరువాత కూడా కమిటీలను ఏర్పాటు చేయటంతో అధిష్ఠానం తాత్సారం చేసింది. రేపుమాపు అంటూ కాలం వెళ్లతీసింది. చిన్న జిల్లాలు ఏర్పాటు చేసిన తరువాత ఐదున్నరేళ్లకు 2022 జనవరి (మిగతా 8లో..)

నేటి నుంచి పోషణ వారోత్సవాలు

మహబూబాబాద్ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం నుంచి ఈనెల 7వ తేదీ వరకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ సంక్షేమ అధికారి శిరీష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిపాల ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్యశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, ఆశావర్కర్లు, మహిళ సం ఘాలు, ప్రైవేట్ ఆస్పత్రులు, టీఎస్పీవోలు కలిసి పని చేయాలన్నారు. 1 నుంచి 7 వరకు అవగాహన కార్యక్రమాలతో పాటు ర్యాలీలు, బహిరంగ సమావేశాలు నిర్వహించాలన్నారు.

5.0మి.మీ. వర్షపాతం నమోదు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం నుంచి గురువారం ఉదయం 8.30 గంటల వరకు 80.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, సగటున 5.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొత్తగూడలో 10.2, గంగారంలో 1.2, బయ్యారంలో 12.2, గార్లలో 5.8, డోర్నకల్‌లో 14.2, కురవిలో 4.2, మహబూబాబాద్‌లో 2.8, గూడూరులో 5.2, కేసముద్రంలో 3.0, నెల్లికుదురులో 0.2, నర్సింహులపేటలో 8.2, చిన్నగూడూరులో 5.2, దంతాలపల్లిలో 6.6, తొర్రూరులో 1.2, మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, మరిపెడ, పెద్దవంగరలో వర్షం పడలేదు.

మహిళాభ్యున్నతికి సర్కార్ పెద్దపీట

- ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మహబూబాబాద్‌లో ఫుడ్ ఫెస్టివల్ ప్రదర్శనలో గారెలు తయారు చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళాభ్యున్నతికి అధిక నిధులు కేటాయిస్తూ, వారికి పెద్దపీట వేస్తున్నారని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. గురువారం మునిసిపాలిటీల్లో వందరోజుల ప్రణాళికలో భాగంగా జిల్లా కేంద్రంలోని తొర్రూరు బస్టాండ్ ఆవరణలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో గురువారం స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. చిరు వ్యాపారులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వంటకాలు, తినుబండారాలు ప్రదర్శించారు. ఒక్కొక్క స్టాల్ వద్దకు వెళ్లి పదార్థాలను పరిశీలించి, వాటి రుచి చూశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని మహిళలు వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల గ్రూపులకు మహిళా శక్తి క్యాంటిన్లు నిర్వహించేలా అవకాశం కల్పించినట్లు తెలిపారు. మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలో 1609 మహిళా సంఘాల్లో 15,535 మంది సభ్యులున్నారని వారికి రూ.34.75 కోట్ల బ్యాంకు రుణాలు ఇచ్చినట్లు చెప్పారు. పట్టణంలో 5,556 మంది వీధి వ్యాపారులు ఉంటే ఒక్కొక్కరి రూ. 10 వేల చొప్పున 5,188 మందికి రుణాలు అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ టి.రాజేశ్వర్, మెప్మా డీఎంసీ విజయ, శానిటరీ ఇన్స్‌పెక్టర్ కరుణాకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ క్రాంతి, సింగు రమేష్, స్ట్రీట్ వెండర్స్ జిల్లా అధ్యక్షుడు సల్వాది దిలీప్, కాంగ్రెస్ నాయకులు ఖలీల్‌పాషా, నీరుటి లక్ష్మీనారాయణ, రామగోని రాజుగౌడ్, ఎడ్ల రమేష్, పోతురాజు రాజు, చలమల నారాయణ, నిమ్మల శ్రీను, నాళ్ల లక్ష్మీనర్సింహారావు, పద్మం ప్రవీణ్, ఆకుల శ్రీనివాస్, బోనగిరి గిరిధర్‌గుప్తా, జంగాల సదాశివుడు, గాదె శ్యాంరావు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో వైద్య కార్యక్రమాలు కొనసాగించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ రూరల్, జూలై31 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో షెడ్యూల్ ప్రకారం.. క్షేత్రస్థాయిలో వైద్య కార్యక్రమాలను కొనసాగించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సెంటర్ పరిధిలోని సిబ్బంది ప్రతిరోజు ప్రతీ ఇంటికి తిరుగుతూ.. ఆరోగ్య సర్వే నిర్వహించి జ్వరాల బారి నపడిన వారి వివరాలను సేకరించాలన్నారు. అవసరం ఉన్నచోట వైద్య శిబిరాలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేయాలని ఆదేశించారు. చికిత్స పొందుతున్న రోగులతో స్వయంగా మాట్లాడి వైద్యం ఎలా అందుతుందని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం.. అందించాలన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు హెల్త్ ఎడ్యుకేషన్, న్యూట్రిషన్‌లపై ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. పిల్లల్లో దాగివున్న మేథస్సును వెలికి తీయడం కోసం ఏఈ డిజిటల్ క్లాసులు నిర్వహించాలన్నారు. కలెక్టర్ వెంట డాక్టర్ సాగర్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

ఓసీ క్లబ్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

- సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథిరెడ్డి



నిరాహార దీక్షలో మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఓసీ క్లబ్ పేరిట ప్రైవేట్ వ్యక్తుల చేతిలో చలామణి అవుతున్న దానిని తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, బహుళ ప్రయోజనాల కోసం వినియోగించాలని సీపీఐ మునిసిపల్ మాజీఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. ఓసీ క్లబ్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్‌లో ఓసీ క్లబ్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో గురువారం రిలే నిరాహార దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అది ఓసీ క్లబ్ కాదని.. ముమ్మాటికి ప్రభుత్వ క్లబ్ అని చెప్పారు. గతంలో దశల వారీగా అనేక ఉద్యమాలు నిర్వహించి అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టిలో తీసుకువెళ్లామని చెప్పారు. ప్రైవేట్ వ్యక్తుల చేతిలో రూ.50 కోట్ల విలువ చేసేక్లబ్ స్థలం కబ్జాకు గురి కాకుండా వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రజల అవసరాల కోసం వినియోగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బీటీ-3 పత్తి విత్తనాలతో మోసపోయిన రైతులు

● ఐదెకరాల పత్తి చేను మాడిపోయిన వైనం


మాడిపోయిన పత్తి మొక్కలను చూపుతున్న రైతు బోడా వాల్యా

మరిపెడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బీటీ- 3 పత్తి విత్తనాలతో మరిపెడ మున్సిపల్ పరిధి మాకులతండాకు చెందిన ఇద్దరు రైతులు మోసపోయారు. ఐదెకరాల పత్తి చేనుకు దళారులు చెప్పిన విధంగా గ్లైసెట్ గడ్డి మందు పిచికారీ చేయగా చేను మొత్తం గడ్డితో సహా మాడిపోయింది. రూ.5లక్షలు నష్టవాటిల్లిందని బాధిత రైతులు నెత్తినోరు కొట్టుకుంటూ రోదిస్తున్నారు. గురువారం బాధిత రైతులు బోడా వాల్యా, రమేశ్ విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం మంగలిబండతండా జీపీకి చెందిన వాంకుడోత్ వీరన్న, మీనేశ్‌లు తమకు మాయమాటలు చెప్పి బీటీ 3 పత్తి విత్తనాలతో అధిక దిగుబడి వస్తుందని తెలిపారన్నారు. ఎలాంటి పాటు చేయకున్నా గ్లైసెట్ గడ్డి మందుతో కలుపు నివారించవచ్చని నమ్మించారు. దీంతో వారి మాటలు నమ్మి వీరన్న, మీనేశ్ దగ్గర రూ.33,600 చెల్లించి 21 ప్యాకెట్ల పత్తి విత్తనాలు కొనుగోలు చేశామన్నారు. పత్తి మొలకెత్తిన అనంతరం చేనులో విపరీతంగా గడ్డి పుట్టగా వారు చెప్పిన విధంగా గ్లైసెట్ పురుగు మందు పిచికారీ చేయగా చేను మొత్తం గడ్డితో సహా మాడిపోయిందని వాపోయారు. దళారుల మాటలు నమ్మి మోసపోయామని బాధిత రైతులు బోరున విలపిస్తున్నారు. జరిగిన మోసంపై మరిపెడ పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి 2.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 3.70మీటర్లు ఎత్తులో ప్రవహిస్తోంది.


మహదేవపూర్ సామాజిక ఆస్పత్రి


ఖాళీగా ఉన్న ప్రసూతి గది

పెద్దాస్పత్రిలో ప్రసవ వేదన

● తీవ్ర ఇబ్బందులు పడుతున్న మహిళలు
● పట్టించుకోని అధికారులు, పాలకులు

మహదేవపూర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఐదు మండలాలకు పెద్ద దిక్కుగా ఉన్న ఆస్పత్రిలో అన్నీ సమస్యలే దర్శనమిస్తున్నాయి. పేదలకు సరైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పాలకులు చెబుతున్నా.. ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. మహదేవపూర్, కాటారం, మహాముత్తారం, పలిమెల, మల్హర్ మండలాల పేద ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్న మహదేవపూర్ సామాజిక ఆస్పత్రిలో ప్రసూతి సేవలు అందని ద్రాక్షలాగే మారింది. ప్రసూతి సేవలు అందించే డాక్టర్లు, సిబ్బంది లేక రోగులు అల్లాడిపోతున్నారు. ఎటు చూసినా ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. పేరుకే పెద్దాస్పత్రి తప్ప మహిళలకు వైద్యం అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చేసేది లేక ఇక్కడి ప్రజలు భూపాలపల్లి జిల్లా కేంద్రానికి, లేదా మంథనికి వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. గైనకాలజీస్టుల పోస్టులు ఖాళీగా ఉండడంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యులు లేకపోవడంతో సామాజిక ఆస్పత్రిలో ఉండే ఆపరేషన్ థియేటర్, అధునాతన యంత్రాలు, పరికరాలు వినియోగం లేకపోవడంతో మూలనపడ్డాయి. జనరల్ సర్జన్, అనస్తీషియా, గైనకాలజిస్ట్, పిల్లల వైద్యుడు, రేడియాలజీ, ప్రత్యేక నిపుణుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య తగ్గిపోయింది.

మహదేవపూర్‌లోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. గతంలో పలుమార్లు ప్రతిపాదనలు చేసినా ఆచరణకు నోచుకోలేదు. ఈ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆస్పత్రిపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు. మంత్రి చొరవ తీసుకుని ఆస్పత్రి అభివృద్ధి, ఖాళీల భర్తీపై చర్యలు చేపడితేనే ఇక్కడి ఐదు మండలాల రోగులకు వైద్యం అందుతుందని పలువురు వాపోతున్నారు.

తీరనున్న ప్రజల ప్రయాణ కష్టాలు

● పూర్తయిన వంతెన నిర్మాణం
● నేడు మంత్రి సీతక్కచే ప్రారంభం

కొత్తగూడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ప్రయాణ కష్టాలు శుక్రవారంతో తీరనున్నాయి. పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క సుమారు రూ.3 కోట్ల నిధులతో ఓటాయి-పొగుళ్లపల్లి మధ్య మంజూరు చేసిన వంతెన నిర్మాణం పూర్తయింది. కాంట్రాక్టర్ జనార్ధన్‌రెడ్డి పనులు చేపట్టి నాలుగు నెలల్లోనే పూర్తిచేశారు. నేడు మంత్రి సీతక్క ఈ వంతెనను ప్రారంభించనున్నట్లు కాంట్రాక్టర్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి తెలిపారు.

నేడు కొత్తగూడలో సీతక్క పర్యటన

కొత్తగూడ మండలంలో శుక్రవారం పంచాయతీరాజ్ సీతక్క పర్యటించను న్నట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య తెలిపారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ కొత్తగూడలోని రైతు వేదికలో నూతన రేషన్‌కార్డులను మంత్రి సీతక్క పంపిణీ చేయడంతో పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


ఓటాయి- పొగుళ్లపల్లి మధ్యనున్న వంతెన

కాళేశ్వరంలో భక్తుల సందడి

మహదేవపూర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరానికి శ్రావణ గురువారం సందర్భంగా భక్తజనం పోటెత్తారు. ముం దుగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి శివుడికి ప్రీతికరమైన శ్రావణమాసం సందర్భంగా బిల్వార్చన, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

వేలం ద్వారా 61.31లక్షల ఆదాయం

కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయానికి ఈ-టెండరు, బహిరంగ వేలం ద్వారా రూ.61,31,782 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.మహేష్ తెలిపారు. పర్యవేక్షణాధికారిగా పరకాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ నందనం కవిత ఆధ్వర్యంలో టెండరు ప్రక్రియ నిర్వహించినట్లు ఈవో పేర్కొన్నారు. షాప్ నెంబరు-3లో బొమ్మలు, గాజులు, మనియార్ అమ్ముకొనే హక్కులకు రూ.6.80లక్షలు, టెంకాయలు, పూజ సామగ్రి అమ్ముకొనేందుకు రూ.23 లక్షలు, షాప్ నెంబరు 5లో బొమ్మలు, గాజులు, మనియార్ అమ్ముకోనేం దుకు రూ.7,90,116, కొబ్బరి ముక్కలు పోగు చేసుకొనే హక్కులకు రూ.20,11,666, అమ్మవార్ల చీరలు పోగు చేసుకునేందుకు రూ.3.50 లక్షలకు టెండర్లు దక్కించుకున్నారు. మొత్తం రూ.61,31,782 ఆదాయం వచ్చినట్లు ఈవో చెప్పారు. మరో ఆరు టెండర్లకు పాటదారులు రానందున మరోసారి టెండరు నిర్వహించనున్నట్లు తెలిపారు.


గోదావరి వద్ద భక్తుల సందడి

ఒకరికి మూడేళ్ల జైలు శిక్ష

మహబూబాబాద్ క్రైం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని దంతాలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో దాఖలైన తీవ్ర నేరమైన కేసుల ఘటనలో ఒకరికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ మహబూబాబాద్ సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సేషన్ జడ్జి గురువారం తీర్పును వెల్లడించారు. దంతాలపల్లి మండలంలోని ఓ తీవ్రమైన కేసులో నిందితుడైన ఎరుకొండ నరేష్‌పై అందిన ఫిర్యాదును అప్పటి విచారణ అధికారి ఎస్సై జగదీష్, బ్రీపింగ్ అధికారి ఎస్సై పి.రాజు, లైజర్ అధికారి జీనత్ కోర్టులో దాఖలు చేసిన ఆధారాల ప్రకారం పీపీ వాదనలు జరిగాయి. అనంతరం ఐపీసీ సెక్షన్ 452, 307, 505 కింద నిందితునికి 3 సంవత్సరాల కఠిన కారాగాల శిక్షతో పాటు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సేషన్ జడ్జి తీర్పును వెల్లడించారు. నిందితుడికి శిక్ష పడే లా కృషి చేసిన అధికారులను ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అభినందించారు.

పోలీసులు ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవాలి

● అత్యాధునిక పరిజ్ఞానంతో నేర నియంత్రణకు కృషి చేయాలి
● జిల్లాస్థాయి సమీక్షలో జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్‌రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ క్రైం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు విధి నిర్వహణలో ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునేలా కృషి చేసి, ఆత్యాధునిక పరిజ్ఞానంతో నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్‌కేకన్ అన్నారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లోని మీటింగ్ హాల్‌లో జిల్లాలో నేరాల పరిస్థితి, పెండింగ్ కేసుల పరిణామాలు, విచారణలో ఉన్న పెండింగ్ కేసుల పురోగతితో పాటు పలు అంశాలపై గురువారం జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నేరాల నియంత్రణకు సాంకేతిక అధారాలతో కూడిన ఆధునిక పద్ధతులను అమలు చేయాలన్నారు. పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌డీపీఎస్ చట్టాలపై స్పష్టమైన అవగాహనతో చట్టవిరుద్ధమైన మారకద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించడానికి కేసు దర్యాప్తు చేసి నిందితులకు కఠిన శిక్ష పడేలా కృషి చేయాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో వేగవంతమైన విచారణ చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలన్నారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టి రాత్రి, పగలు పెట్రోలింగ్ చేయాలన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, లోన్‌యాప్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, జూదం, పీడీఎస్ బియ్యం అక్రమ దందాలపై నిఘా పెంచి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ముందస్తు ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు.

అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన పలువురు పోలీస్ అధికారులకు, సిబ్బందికి ప్రశంస ప్రోత్సాహకాలను అందజేశారు. సమావేశంలో డీఎస్పీలు తిరుపతిరావు, కృష్ణ కిషోర్, డీసీఆర్‌బి సీఐ సత్యనారాయణ, ఎస్‌బీ సీఐ చంద్రమౌళి, సైబర్ క్రైం డీఎస్పీ శ్రీనివాస్, రూరల్ సీఐ సర్వయ్య, సీసీఎస్ సీఐ హత్తిరాం, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీలు


అంకుసాపూర్‌లో కూలీల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఆర్‌పీ

కాటారం, జూలై 31(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని 24 గ్రామపంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల్లో తనిఖీలు ప్రారంభించాయి. సోషల్ ఆడిట్ స్టేట్ రీసోర్స్ పర్సన్ కవిత ఆదేశాల మేరకు పలువురు డీఆర్పీలు, వీఆర్పీలు విలాసాగర్, గుండ్రాత్‌పల్లి, అంకుసాపూర్, కొత్తపల్లి, వీరాపూర్, కాటారం, గుమ్మళ్లపల్లి, ప్రతాపగిరి, జాదరావుపేట తదితర జీపీల్లో గురువారం తనిఖీలు చేపట్టారు. 2024 ఏప్రిల్1 నుంచి ఈ ఏడాది మార్చి31వ తేదీ వరకు ఉన్న ఆర్థిక సంవత్సరంలో రూ.8,29,72,509 నిధులతో చేపట్టిన 323 ఈజీఎస్ పనులను తనిఖీ చేయనున్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా 46 సీసీ రోడ్లు, డ్రెయిన్ల తదితర 46 పనులకు గానూ ఖర్చు చేసిన రూ.4.55 కోట్లు నిధులు, ఈజీఎస్ ద్వారా 271పనులకు గానూ రూ.3.72కోట్లు, అటవీశాఖ ద్వారా సుమారు రూ.30 లక్షలకు పైగా నిధులతో చేపట్టిన 6 పనులను తనిఖీలు నిర్వహిస్తున్నారు. 9 ఆడిట్ బృందాలు తొలి విడతలో మండలంలోని 12 జీపీల పరిధిలో, రెండో విడతలో మరో 12 జీపీల్లో తనిఖీ నిర్వహిస్తాయి.

రెండు, మూడు రోజులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించిన అనంతరం గ్రామ స్థాయిలో ఆగస్టు 1-6వ తేదీ వరకు గ్రామసభలు పెట్టి తనిఖీ సందర్భంగా తేలిన అంశాలను చర్చించనున్నారు. గ్రామ సభల్లో తనిఖీల సందర్భంగా వెల్లడైన లోపాలు, అవకతవకలు ఉంటే వెల్లడిస్తామని డీఆర్పీలు తెలిపారు. గ్రామ సభల అనంతరం మండల స్థాయిలో ఆగస్టు 7న ప్రజావేదిక నిర్వహించనున్నారు.

పాల్కూరికి స్మృతి వనం ఉపయోగంలోకి తేవాలి

పరిసరాలను ఊడుస్తూ బీఆర్‌ఎస్ నిరసన

పాలకుర్తి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన పాల్కూరికి సోమనాథుడు స్మృతి వనం పశువుల పాకల మారడంతో గురువారం బీఆర్‌ఎస్ నాయకులు విగ్రహాన్ని పాలతో శుద్ధి చేసి, ఆవరణను చీపుర్లతో ఊడుస్తూ నిరసన తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ ఆధ్వర్యంలో స్మృతి వనాన్ని పరిశీలించారు. నవీన్, ఎఫ్ ఎస్ సీఎస్ చైర్మన్ బొబ్బాల అశోక్‌రెడ్డి మాజీ ఎంపీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో రూ.కోటి వెచ్చించి తొలి తెలుగు విప్లవ కవి సోమనాథుడు పేరుతో స్మృతివనం నిర్మించారన్నారు. మాజీ మంత్రి దయాకర్‌రావు పర్యాటకంగా అభివృద్ధి చేసి యువతను కవులుగా, రచయితలుగా ఎదగాలని భావిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి స్మృతివనాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

విద్యాశాఖకు మంత్రిని నియమించాలి

● ఏబీఎస్‌ఎఫ్ విద్యార్థుల ఆందోళన
● సీఎం దిష్టిబొమ్మ దహనం


సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి నాయకులు

కేయూ క్యాంపస్ జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కేయూ మొదటి గేటు వద్ద విద్యార్థులు ఆందోళన చేపట్టారు. అక్కడ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈసందర్భంగా మంద నరేశ్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు, స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం లేదన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజులు రాకపోవడంతో విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారని విమర్శించారు. ప్రైవేట్ సంస్థల్లో ఫీజుల జులుంను అడ్డుకోవాలని అన్నారు. విద్యార్థుల సమస్యలపై కాంగ్రెస్‌పై నిరసన దీక్షలు చేస్తామన్నారు. కాగా, సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ నేతలు విజయ్, నందు, విష్ణు, పీటర్, శ్రీకాంత్, పవన్, అరవింద్, నవీన్, తరుణ్, గణేశ్, వంశీ, గోవింద్, సమ్మయ్య, సూర్య సాయి తదితరులు పాల్గొన్నారు.


రాజారాంనాయక్‌ను సన్మానిస్తున్న ఎరువుల డీలర్లు

ఏఎంసీ డైరెక్టర్‌కు సన్మానం

కాటారం, జూలై 31(ఆంధ్రజ్యోతి): కాటారం ఏఎంసీ డైరెక్టర్‌గా నియమితులైన మహాముత్తారం మండలం పెగడపల్లికి చెందిన రైతు, ఎరువుల దుకాణం డీలర్ జాటోత్ రాజారాంనాయక్‌ను కాటారం మండల ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. పూలబొకే అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కవ్వాల శేఖర్ ప్రతినిధులు బొమ్మ సమ్మిరెడ్డి, కొత్త రాజేందర్, అల్లాడి చంద్రమౌళి, సామ బాలచందర్, నిడిగొండ చెన్నకేశవ్, గట్టు రమేష్, తోట కోటేశ్వర్ తదితరులు ఉన్నారు.

మొగుళ్లపల్లి ఎంపీడీవోగా నరేందర్‌గౌడ్

మొగుళ్లపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మొగుళ్లపల్లి ఎంపీడీవో జి.నరేందర్‌గౌడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సురేందర్‌గౌడ్ ఖమ్మం జిల్లా నుంచి బదిలీపై వచ్చారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలుశిక్ష

మట్టెవాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో 11 మందికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేష్ గురువారం రూ.11,800 జరిమానా, ఐదుగురు వాహనదారులకు జైలుశిక్ష విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.సుజాత తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో వరంగల్ జిల్లా గీసుగొండ మండలం మొగిలిచర్లకు చెందిన గనిపాక కిరణ్, సంగెంకు చెందిన ఈద వరుణ్‌లకు రెండు రోజుల జైలుశిక్ష, వరంగల్ పైడిపల్లికి చెందిన తిక్క స్వామి, బూజుగుండ్ల బాబు, వరంగల్ ఏసీరెడ్డినగర్‌కు చెందిన శ్రీరాముల రమేశ్‌లకు మూడు రోజుల జైలుశిక్ష విధించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఇద్దరికి రూ.1000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ సుజాత పేర్కొన్నారు.

భూపాలపల్లితో విడదీయని బంధం

● నా ఊపిరి ఆగాకే అది వీడుతుంది
● ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి


కేటీకే 5 ఇన్‌క్లైన్ గని వద్ద మహిళా కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

కృష్ణకాలనీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లితో తనకు విడదీయలేని బంధం ఉందని, ఊపిరి ఆగాకే అది తెగిపోతుందని ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. భూపాలపల్లి పట్టణంలో ఆయన విస్తృతంగా గురువారం పర్యటించారు. తొలుత భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి, జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని 1 ఇన్‌క్లైన్, 5 ఇన్‌క్లైన్ గనుల్లో పర్యటించారు. కార్మికులతో మమేకం అయ్యారు. సమస్యలేమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. జంగేడులోని కస్తూర్బా పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. బోర్డుపై ఆల్ ది బెస్ట్ విద్యార్థులంటూ రాసి, వారితో సహపంక్తి భోజనం చేశారు. అలాగే, పట్టణంలోని జయశంకర్ పార్కు, వేషాలపల్లి, కారల్‌మార్క్స్‌కాలనీ, వంద పడకల ఆస్పత్రి, ఎల్‌బీనగర్ కాలనీల్లో పర్యటించారు. ప్రజలతో పాటు బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులతో మాటామంతీ చేశారు. మంజూర్‌నగర్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో కొద్దిసేపు చిట్‌చాట్ నిర్వహించారు. భవిష్యత్తులో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై విలేకరులు ప్రశ్నించగా ఆ విషయాన్ని తాను మాట్లాడబోనని దాటవేశారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2151	1521
పల్లికాయ (సూక)	6200	3450
పల్లికాయ (పచ్చిది)	3820	1575
కందులు	5633	3022
పెసళ్లు	5752	3022
పత్తి	7625	5300
పసుపు (కాడి)	10333	9534
పసుపు (గోల)	10509	8700
తేజ మిర్చి	11500	8500
తేజ ఏసీ	13500	11500
వండర్‌హాట్	10500	6000
వండర్‌హాట్ ఏసీ	15500	11500
యూఎస్341ఏసీ	13300	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	5000	3000

- వరంగల్ వ్యవసాయం

60ఏళ్లు దాటిన అన్నదాతలకు పెన్షన్

ప్రచారం చేస్తున్నాం..

రైతులకు వృద్ధాప్యంలో పీఎం కిసాన్ మన్ ధన్ యోజన ఎంతో ఆసరాగా ఉంటుంది. ఈ పథకంపై అవగాహన కల్పించేందుకు ప్రచారం నిర్వహిస్తున్నాం. ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తులు చేసుకోవాలి.

- విజయ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి

- రైతులకు వరంగా పీఎం కిసాన్ మాన్‌ధన్
- 18 నుంచి 40ఏళ్ల రైతులు అర్హులు.. రూ.55 నుంచి ప్రీమియం
- అదనంగా బీమా కంపెనీకి ప్రభుత్వం నగదు జమ

వర్ధన్నపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రధాన మంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకం రైతులకు వరంగా మారనుంది. రైతులు వృద్ధాప్యంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయం చేసుకున్న వారు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ మాన్‌ధన్ యోజన పథకాన్ని తీసుకువచ్చింది. వృద్ధాప్యంలోకి వచ్చాక చాలామంది రైతులకు ఎలాంటి ఆదాయ వనరులు ఉండవు.

ఈ నేపథ్యంలో వయస్సు పైబడిన చిన్న, సన్నకారు రైతులకు అండగా ఉండేందుకు కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద 60ఏళ్లు నిండాక రైతులకు ప్రతీ నెల రూ.9వేల చొప్పున పింఛన్ జీవితకాలం అందుతుంది. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న రైతులు ఈ పథకంలో చేరేందుకు అర్హులు. భూరికార్డుల్లో తమ పేరు ఉండి రెండు హెక్టర్ల వరకు సాగు చేసేందకు వీలుగా భూమి ఉన్న వారు ఈ పథకం కింద పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఎప్పుడు నమోదు చేసుకున్నా పెన్షన్ 60ఏళ్లు దాటాకే వస్తుంది. నేషనల్ స్కీం, ఈఎస్ఐ స్కీం, ఈపీఎఫ్‌వో పరిధిలో ఉన్నవారు ఎవ్వైనా ఇతర చట్టబద్ధ సామాజిక భద్రతా పథకాల పరిధిలో ఉన్న వారు ఉన్నత ఆర్థికస్థితి కలిగిన వారు, ట్యాక్స్ పరిధిలో ఉన్నవారు ఏదైనా ఇతర చట్టబద్ధ సామాజిక భద్రత పథకాల పరిధిలో ఉన్నవారు, ఉన్నత ఆర్థిక స్థితి కలిగిన వారు, ట్యాక్స్ పేయర్లు ఈ పథకానికి అర్హులు కారు. ఈ పెన్షన్ అందేవరకు కొంత ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. పథకంలో చేరే వారి వయస్సును బట్టి ప్రీమియం ఉంటుంది. రైతు చెల్లించినంతే ప్రభుత్వం కూడా తన వంతుగా బీమా కంపెనీకి నగదు జమ చేస్తుంది.

ప్రీమియం వివరాలు

18 నుంచి 40 ఏళ్ల వయస్సులోపు రైతులు ఈ పథకానికి అర్హులు. ప్రతీ నెల రూ.55 రూపాయల నుంచి రూ.200 రూపాయల వరకు ప్రీమియంను బ్యాంక్ ఖాతా నుంచి చెల్లించాల్సి ఉంటుంది. రైతు చెల్లించిన ప్రీమియం మొత్తానికి



కేంద్ర ప్రభుత్వం సమానంగా చెల్లిస్తుంది. రైతు రూ.55జమ చేస్తే ప్రతీ నెల రూ.110 జమ అవుతుంది. 20 ఏళ్ల వయస్సు గల రైతులు రూ.61 ప్రీమియం, 25 ఏళ్ల వారికి రూ.61 ప్రీమియం, 30ఏళ్ల వారికి రూ.105, 35 ఏళ్ల వారికి రూ.150, 40 ఏళ్ల వారికి ప్రీమియం రూ.200 ఉంటుంది. రైతు మరణిస్తే భార్య ఈ పథకాన్ని కొనసాగించవచ్చు. 60 ఏళ్ల తరువాత రైతు మరణిస్తే భార్యకు రూ.1,500 పెన్షన్ వస్తుంది. రైతు ఫొటో నివాస ధ్రువీకరణ పత్రం, సాగుభూమి, ఆదాయం వంటి వివరాలను, పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. కాగా, ఈ కిసాన్ మాన్‌ధన్ పథకంలో చేరాలంటే కామన్ సర్వీస్ సెంటర్లలో రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేసుకోండి ఇలా..

పీఎం కిసాన్ లబ్ధిదారులు కామన్ సర్వీస్ సెంటర్ (సీఎంసీ) పీఎం కిసాన్ పీఎం కేఎంవై పోర్టర్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రైతు మొదట తన ఆధార్ నంబర్ ఎంటర్ చేయాలి. పీఎం కిసాన్ పథకానికి నమోదైన బ్యాంక్ ఖాతా నుంచి ప్రీమియం డబ్బులను చెల్లించాలి. ప్రతీనెల ఆటోమెటిగ్గా డబ్బులు ఖాతా నుంచి పథకానికి జమ అవుతాయి. నామినీ వివరాలను నమోదు చేయాలి. మాన్ ధన్ దరఖాస్తును డౌన్‌లోడు చేసుకోని రైతు సంతకం చేసి పోర్టల్లో అప్లోడ్ చేయాలి. వెంటనే మీకు పీఎం కిసాన్ మాన్‌ధన్ పింఛన్ కార్డు జనరేట్ అవుతుంది. కార్డును డౌన్‌లోడు చేసుకోవాలి. ప్రతీ నెలా బ్యాంక్ ఖాతా నుంచి ప్రీమియం డబ్బులు పీఎంకేఎంవై పథకానికి ఆటోమేటిక్‌గా జమ అవుతాయి. పీఎం కిసాన్ లబ్ధిదారులు కానట్లయితే సీఎస్‌సీలో మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకోని పింఛన్ కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు, ప్రీమియం డబ్బును నగదు రూపంలో చెల్లించాలి. ఆ తరువాత బ్యాంక్ ఖాతాను జత చేసుకోవాలి.





కొత్త జీపీలు, అంగన్వాడీలకు సొంత భవనాలు

- రూ.48కోట్ల నిధులు మంజూరు
- త్వరలో ప్రారంభం కానున్న పనులు
- పంచాయతీ ఎన్నికల నాటికి సిద్ధం
- సిబ్బందికి తీరనున్న కష్టాలు

హనుమకొండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో త్వరలో కొత్త గ్రామ పంచాయతీలు, అంగన్వాడీ కేంద్రాలు సొంత భవనాలకు నోచుకోనున్నాయి. 2019 లో పాలనాసౌలభ్యం కోసం చిన్న గ్రామాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. ఆరేళ్ల కిందట ఏర్పాటైన వాటికి ఇప్పటివరకూ భవనాలు నిర్మించలేదు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్న క్రమంలో భవనాల నిర్మాణాన్ని చేపట్టింది. అంగన్వాడీ కేంద్రాల్లో చాలా వాటికి సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కునారిల్లుతున్నాయి. కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, ఇతరత్రా భవనాల్లో ప్రస్తుతం పంచాయతీ కార్యాలయాలు నడుస్తున్నాయి. దీంతో గ్రామసభలు, సమావేశాలు నిర్వహించేందుకు, ఫైళ్లను భద్రపరిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

ఎన్నికల నాటికి సిద్ధం

ఎన్నికల్లోగా భవనాలను పూర్తిచేయాలని కసరత్తు చేస్తున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రతీ మండలంలో రెండు గ్రామ పంచాయతీ భవనాలు, రెండు అంగన్వాడీ భవనాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సంవత్సర డిసెంబర్ నాటికి భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఉంది. పంచాయతీ భవనాలను ఒక్కొక దానిని రూ.20లక్షలతో, అంగన్వాడీ భవనాలను పూర్తిగా ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తారు. అంగన్‌వాడీ భవనాలను రూ.12లక్షతో నిర్మిస్తారు. ఈ మొత్తంలో ఉపాధి హామీ ద్వారా రూ.8లక్షలు, మహిళా శిశు సంక్షేమం నుంచి రూ.2లక్షలు 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ.2లక్షలు కలిపి నిర్మిస్తారు.

స్థలాలున్నవాటికే..

భవనాల నిర్మాణానికి స్థలాలున్న పంచాయతీలనే ఎంపిక చేశారు. స్థలం లేకుండా భవనాలు మంజూరు చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయన్న ఉద్దేశంతోనే ఈ విధంగా చేశారు. సొంతంగా ప్రైవేటు స్థలాలు కొనుగోలు చేసే స్థోమత పంచాయతీలకు లేదు. ప్రస్తుతం మంజూరైన వాటిని నామినేషన్‌పై కేటాయిస్తారు. అయితే బిల్లులు సకాలంలో వస్తాయో రావోననే అనుమానంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు వచ్చేలా లేరు. పనుల నిర్వహణను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు. నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు యూనిక్ మోడల్‌గా ఉంటాయి. ఈ భవనాలను ప్రజలు చూడగానే అవి గ్రామ పంచాయతీ భవనాలని, ఇవి అంగన్‌వాడీ భవనాలని గుర్తించేలా డిజైన్లను రూపొందించారు.

300 భవనాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 150 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.30కోట్లు, అంగన్వాడీ కేంద్రాల భవనాలకు రూ.18కోట్లు విడుదలయ్యాయి. వరంగల్ ఇల్లాలో 22 పంచాయతీ, 22 అంగన్వాడీ, హనుమకొండ జిల్లాలో 24 పంచాయతీ, 24 అంగన్వాడీ, జనగామ జిల్లాలో 24 పంచాయతీ, 24 అంగన్వాడీ, మహబూబాబాద్ జిల్లాలో 36 పంచాయతీ, 36 అంగన్వాడీ, ములుగు జిల్లాలో 20 గ్రామ పంచాయతీ, 20 అంగన్వాడీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 24 పంచాయతీ, 24 అంగన్వాడీ భవనాల నిర్మాణం జరుగుతుంది. ఇరుకు గదులు, కనీస సౌకర్యాలు లేక అద్దెభవనాల్లో నడుస్తున్న, శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు కూలుతుందో తెలియక భయం భయంతో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్న పంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తారు.

ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్ విడుదల

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్‌ను విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ నవీన్ నికోలస్ గురువారం విడుదల చేశారు. అర్హులైన సీనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 హెడ్మాస్టర్లుగా, ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులను కల్పించనున్నారు. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 114 మంది స్కూల్ అసిస్టెంట్లు హెడ్మాస్టర్లుగా పదోన్నతులు పొందనున్నారు. షెడ్యూల్ వివరాలు ఇలా ఉన్నాయి. ఆగస్టు 2న సంబంధిత డీఈవో, ఆర్జేడీ కార్యాలయాల్లో ప్రొవిజనల్ సీనియారిటీ లిస్టులను డిస్‌ప్లే చేస్తారు. 3న ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తారు. 4, 5 తేదీల్లో ఉపాధ్యాయుల నుంచి వచ్చిన అభ్యంతరాలను సరిచేసి సీనియారిటీ లిస్టులను రూపొందించి డిస్‌ప్లే చేస్తారు. 6న వెబ్‌ఆప్షన్లు ఎంపిక చేసుకోవడంతోపాటు ఎడిట్ చేసుకునే అవకాశం ఉంటుంది. 7న పదోన్నతులు పొందిన స్కూల్ అసిస్టెంట్లకు హెడ్మాస్టర్లుగా పదోన్నతులు ఇస్తూ ఉత్తర్వులు అందజేస్తారు. 8, 9 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ లిస్టును డిస్‌ప్లే చేస్తూ ఎస్జీటీ ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తారు. అనంతరం ఫైనల్ సీనియారిటీ లిస్టును రూపొందించి డిస్‌ప్లే చేస్తారు. 10న వెబ్‌ఆప్షన్ల ఎంపికతోపాటు ఎడిట్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు 11న డీఈవోలు ఆర్డర్లు ఇస్తారు. ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ మొత్తం 10 రోజుల్లో ముగించేందుకు విద్యాశాఖ షెడ్యూల్‌ను ప్రకటించింది.

ఉమ్మడి జిల్లాలో 114 మందికి పదోన్నతులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 114 మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు హెడ్మాస్టర్లుగా పదోన్నతులు పొందనున్నారు. గవర్నమెంట్ యాజమాన్యంలో 7గురు, లోకల్‌బాడీ యాజమాన్యంలో 107 మంది పదోన్నతి పొందనున్నారు. వరంగల్ జిల్లాలో 25 మంది, హనుమకొండలో 26, మహబూబాబాద్‌లో 15, జనగామలో 20, జయశంకర్ భూపాలపల్లి 16, ములుగు జిల్లాలో 12 మంది స్కూల్‌అసిస్టెంట్లు హెడ్మాస్టర్లుగా పదోన్నతులు పొందనున్నారు. కాగా, ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులకు సంబంధించిన ఖాళీలను విద్యాశాఖాధికారులు ఇప్పటి వరకు గుర్తించలేదు. షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో రెండు రోజుల్లో ఎస్జీటీల సీనియారిటీ లిస్టులను రూపొందిస్తామని వారు పేర్కొంటున్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న అర్చక, ఉద్యోగ నేతలు

దేవాదాయ ఉద్యోగులకు ప్రమోషన్లు

మంత్రి కొండా సురేఖ హామీ

హనుమకొండ కల్చరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆలయాల్లో పనిచేసే ఉద్యోగులకు, అర్చకులకు ప్రమోషన్లు ఇవ్వడంలో జాప్యం జరుగుతోందని, తద్వారా ఇంక్రిమెంట్లు రాకుండా ఉద్యోగులు అర్చకులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆలయాల అర్చకులు, ఉద్యోగులు గురువారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా స్పందించిన మంత్రి అధికారులతో మాట్లాడి వీలైనంత తొందరగా ప్రమోషన్లు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో తెలంగాణ అర్చక ఉద్యోగ జాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చక సమాఖ్య నూతన అధ్యక్షుడు గట్టు శ్రీనివాసాచార్యులు, ధూప, దీప నైవేద్య రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహాచార్యులు, కార్యదర్శి పెండెం సురేందర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ శర్మ, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమాచార్యులు తదితరులు మంత్రిని కలిసి ప్రత్యేకంగా వినతిపత్రం సమర్పించారు.

నైపుణ్యం, సామర్థ్యం పెంచేందుకే డ్యూటీ మీట్

- తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశంలోనే టాప్
- అదనపు డీజీపీ, టీజీపీఏ డైరెక్టర్ అభిలాష బిస్ట్
- మామునూరు పీటీసీలో సందడిగా డ్యూటీ మీట్
- పాల్గొన్న 400 మంది పోలీసులు



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్



పోలీసు జాగిలంతో కరచాలనం చేస్తున్న పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట



మాట్లాడుతున్న అదనపు డీజీపీ మహేష్ భగవత్



మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

మామునూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పోలీసులు నైపుణ్యం సాధించేందుకు డ్యూటీ మీట్ శిక్షణ ఎంతో అవసరమని తెలంగాణ పోలీస్ అకాడమీ(టీజీపీఏ) డైరెక్టర్ అభిలాష బిస్ట్ అన్నారు. వరంగల్ జిల్లా కేంద్రం మామునూరు పీటీసీ వేదికగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన 2వ తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్-2025 పోటీలను టీజీపీఏ డైరెక్టర్ అభిలాష బిస్ట్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అంతకుముందు అదనపు డీజీపీతో కలిసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలీసులు విధుల్లో అత్యుత్తమంగా రాణించాలంటే వృత్తి నైపుణ్యం సొంతం చేసుకోవడం ఎంతో కీలకమని అన్నారు. దేశంలో నేర దర్యాప్తుతో పాటు అన్ని విభాగాల్లో తెలంగాణ మొదటి రెండు స్థానాల్లో నిలవడం సంతోషదాయకమన్నారు. తీవ్ర ఒత్తిడితో విధులు నిర్వహించే పోలీసుల్లో ఈ డ్యూటీ మీట్ పోటీలు ఉత్తేజం నింపుతాయని అన్నారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు జరుగనున్న ఈ డ్యూటీ మీట్‌లో రాష్ట్రంలోని ఏడు జోన్లతో పాటు హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్ పోలీసులు, సీఐడీ, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ విభాగాలకు చెందిన సుమారు 400 మందికి పైగా పోలీస్ అధికారులు, సిబ్బంది జిల్లాకు చేరుకున్నారని, వీరు నిర్ణయించిన తేదీల ప్రకారం తాము ఎంపిక చేసుకున్న 25 విభాగాలలో పోటీ పడుతారని చెప్పారు. పోటీల్లో పాల్గొనే అభ్యర్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. డ్యూటీ మీట్ పోటీల ద్వారా పోలీస్ అధికారులు చట్టాల అమలు, అంతర్జాతీయ భద్రత, నేరాలను గుర్తించడం, సులభతరం అవుతుందని వివరించారు. తాను కూడా 25 ఏళ్ల కిందట వరంగల్ మామునూరు పీటీసీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించానని, మళ్లీ అదే ప్రాంగణంలో ముఖ్య అతిథిగా పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొనడం సంతోషకరంగా ఉందని, పాత జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయని తెలిపారు. విధి నిర్వహణలో దర్యాప్తు చేయడం, సామర్థ్యాలను మెరుగు పరుచుకునే అంశాల్లో అవకాశం లభిస్తుందని, అంతేకాక నేరాలను త్వరితగతిన ఛేదించేందుకు, సాక్ష్యాలను శాస్త్రీయంగా విశ్లేషించేందుకు, ప్రజలకు న్యాయం అందించేందుకు ఈ వృత్తి శిక్షణ ఎంతో అవసరమని పేర్కొన్నారు.

సాధనతో ఏదైనా సాధ్యం..

పోలీసులు కష్టపడి సాధన చేస్తే ఏదైనా సాధ్యపడుతుందని అదనపు డీజీపీ మహేష్ భగవత్ అన్నారు. ఇటీవలే రాంచీలో జరిగిన ఆల్ ఇండియా 68వ పోలీస్ డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీసులు అత్యుత్తమ ప్రదర్శనలు ఇవ్వడం ద్వారా ఓవరాల్ టీమ్ చాంపియన్‌గా నిలిచి వివిధ విభాగాల్లో మొత్తం 18 పతకాలను సాధించారని కొనియాడారు. సైంటిఫిక్, ఇన్వెస్టిగేషన్, యాంటీ-సాబోటెజ్ చెక్, డాగ్‌స్క్వాడ్ పోటీల వంటి ఈవెంట్లలో తెలంగాణ బృందం ఆరు బంగారు, నాలుగు రజత, ఎనిమిది కాంస్య పతకాలను గెలుచుకుందన్నారు. ఇదే తరహాలో త్వరలో జరుగబోయే ఆల్ ఇండియా 69వ డ్యూటీమీట్‌లో ఫొటో, వీడియోగ్రఫీ బృందాలు, డాగ్‌స్క్వాడ్ బృందాలు తమ సత్తా చాటి ఎక్కువ మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీఐడీ డీఐజీ నారాయణ నాయక్, వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్, బెటాలియన్ ఎస్పీ రాంరెడ్డి, వరంగల్ పోలీస్ కమిషనరేట్ డీసీపీలు అంకిత్‌కుమార్, షేక్ సలీమా, పీటీసీ ప్రిన్సిపాల్ పూజ, కమాండెంట్‌లు, ఏసీపీలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారులకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం

- యుద్ధోన్మాదులు, మతోన్మాదులతోనే దేశానికి ప్రమాదకరం
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి

ఖిలావరంగల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారులకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయమని, యుద్ధోన్మాదులు, మతోన్మాదులతోనే దేశానికి ప్రమాదకరమని, కగార్ ఆపరేషన్‌పై న్యాయ విచారణ జరపాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా సీపీఐ మహాసభల ముగింపును రెండో రోజు గురువారం ఖిలావరంగల్ మండల కేంద్రంలోని రోటరీ క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తలసరి ఆదాయం రెట్టింపు అయితే ప్రజల కొనుగోలు శక్తి ఎందుకు పెరగలేదని, నిరుద్యోగులకు ఉద్యోగాలు, గిట్టుబాటు ధరలు ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. మోదీ పాలనలో సంపద అంతా కార్పొరేట్ శక్తులైన అంబానీ, అదానీల వద్దే కేంద్రీకృతమైందని, అందుకే పేదల బతుకులు మారలేదన్నారు. మోదీ అధికారంలోకి రాకముందు రూ.50లక్షల కోట్లు ఉన్న అప్పు నేడు రూ.160 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదరికం, నిరుద్యోగం రెట్టింపు అయ్యాయని, ఇళ్లులేని నిరు పేదలు పెరిగిపోయారని చెప్పారు. మోదీ దృష్టి అంతా కార్పొరేట్ శక్తులపైనే ఉండడంతో పేదల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషించిన బీజేపీ యుద్ధోన్మాదానికి తెర లేపిందని, మతోన్మాదులు, యుద్ధోన్మాదులతో దేశానికి ప్రమాదకరమన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం పేర ధనస్వామ్యం, భూస్వామ్యం, ఫాసిజం రాజ్యమేలుతోందని ఆయన ధ్వజమెత్తారు. దేశంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించి 100 ఏళ్లు పూర్తి చేసుకున్న వీరోచిత విప్లవాల చరిత్ర కలిగిన శ్రమ జీవుల పార్టీ సీపీఐ అన్నారు. దశాబ్దాలుగా ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటాలను సీపీఐ నిర్వహించిందని పేర్కొన్నారు. ఎన్నో పార్టీలు పుట్టి కనుమరుగవుతున్నాయన్నారు. ప్రజా ప్రయోజనాలకై నిలబడి ఉండడం వల్లనే అధికారం లేకున్నా కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల పాటు నిలబడిందన్నారు. సీపీఐ ఆవిర్భవించి ఈ ఏడాది డిసెంబరు 25 నాటికి వందేళ్లు కావస్తుందన్నారు. వందేళ్ల ముగింపు బహిరంగ సభను ఖమ్మంలో 5లక్షల మందితో నిర్వహించనున్నట్లుగా ఆయన తెలిపారు.



సీపీఐ జిల్లా 2వ మహాసభలో జెండా ఎగురవేస్తున్న సీపీఐ రాష్ట్ర నాయకుడు వెంకట్రాములు

అంబేద్కర్‌వాదులు, కమ్యూనిస్టులు ఏకం కావాలి

అంబేద్కర్ వాదులు, కమ్యూనిస్టులు ఏకం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యవర్గ సభ్యుడు తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు అన్నారు. కేంద్రంలో మోదీ 3వసారి ప్రధాని అయిన తర్వాత అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని మార్చివేసి మనువాదాన్ని తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. అలాగే ఆరేషన్ కగార్, వక్ఫ్ బిల్లు పేరుతో దాడి తీవ్రతరం చేస్తూ ముస్లింలు, క్రిస్టియన్‌లు, కమ్యూనిస్టులను శత్రువులుగా చూస్తున్నారన్నారు. అందుకే దేశంలో అంబేద్కర్ వాదులు, కమ్యూనిస్టులు ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలో తలసరి ఆదాయం పెరిగిందని, ప్రపంచంలో మన దేశం 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, తప్పుడు లెక్కలు చెబుతున్నారని, దొంగ లెక్కలు, మాయ మాటలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దేశంలో సంపద రెట్టింపు కాలేదని, కేవలం అంబానీ, అదానీలాంటి కార్పొరేట్ శక్తుల ఆదాయమే పెరిగిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో మన పాత్ర ఉందని, అసెంబ్లీలో సీపీఐకి ఒక్క ఎమ్మెల్యేనే ఉన్నప్పటికీ ప్రజా సమస్యలపై గళమెత్తడంలో ముందున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

అనంతరం వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి ఇప్పటి వరకు పార్టీ నిర్వహించిన కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టగా, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి ప్రతినిధుల సభను ఉద్దేశించి ప్రసంగించారు. తొలుత జిల్లా మహాసభల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీపీఐ పతాకాన్ని రాష్ట్ర నాయకుడు తాటిపాములు వెంకట్రాములు ఎగురవేశారు. అనంతరం కళాకారులు ప్రదర్శనలు చేశారు. ఈ మహాసభకు అధ్యక్షవర్గంగా దండు లక్ష్మణ్, గుండె భద్రి, అక్కెనపల్లి రమేష్, ల్యాదల్ల శరత్, తోట చంద్రకళ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.విజయసారథి, రాష్ట్రకార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర నాయకులు సిరబోయిన కరుణాకర్, పంజాల రమేష్, ఆదరి శ్రీనివాస్, సయ్యద్ వలీ ఉల్లాఖాద్రి, ఎస్‌ఏ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్‌కే బాషుమియా, ప్రనాస ప్రసాద్, నాయకులు భిక్షపతి, రమేష్, రవీందర్, చంద్రకళ, ఎలేందర్, భద్రి, రవి, చెన్నకేశవులు, మునీశ్వర్, క్రిష్ణ, శంకరయ్య, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టించొద్దు

గూడూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : యూరియాను కృత్రిమ కొరత సృష్టించవద్దని జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి అజ్మీర శ్రీనివాస్ అన్నారు. గూడూరు సొసైటీలో ఎరువుల గోదాంను గురువారం పరిశీలించారు. అనంతరం అప్పరాజుపల్లి, గోవిందపురం గ్రామాలలో వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు సరిపడ యూరియా అందుబాటులో ఉందని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వరి నాటు పెట్టిన తర్వాత ప్రతి 2 మీటర్లకు కాలిబాట తీయడం వలన వెళ్తురు ప్రసారించడంతో సుడిదోమ ఉధృతి నివారించవచ్చన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ ఉన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

● డీపీఆర్వో రాజేంద్రప్రసాద్

మహబూబాబాద్ టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జిల్లా పౌరసంబంధాల అధికారి (డీపీఆర్వో) పి.రాజేంద్రప్రసాద్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లోని డీపీఆర్వో కార్యాలయంలో గురువారం తెలంగాణ సాంస్కృతిక సారథులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఆర్వో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నందున వాటిని క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లే గురుతర బాధ్యత సాంస్కృతిక సారథులపై ఉందన్నారు. ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లు, ఇందిరమ్మ ఇళ్ల పథకం, రైతు బంధు, రైతు భరోసా, రుణమాఫీ, రైతు బీమా, మహాలక్ష్మి,


మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

గృహజ్యోతి, రూ.500లకే గ్యాస్ పంపిణీ, సన్న బియ్యం, రేషన్‌కార్డుల పంపిణీ, ఇందిరా జలగిరి వికాసం, స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు, మహిళలకు పెట్రోల్ పంపుల నిర్వహణ, ఆర్టీసీ అద్దె బస్సుల నిర్వహణ తదితర పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. వాటిపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. వినూతన్న రీతిలో పాటలు, పల్లె సుద్దులు, వీధి నాటకాల రూపాల్లో ప్రదర్శనలిస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. జిల్లాలో జరిగే జిల్లా, రాష్ట్రస్థాయి ప్రత్యేక కార్యక్రమాల్లో సాంస్కృతిక సారథులు భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సమావేశంలో కె.రాము, సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి సత్యనారాయణ, టీం లీటర్లు కొమిరె వెంకన్న గిద్దె రాంనర్సయ్య, మెరుగు రవీందర్, బండ వెంకన్న, ఐలేష్ కుమార్, భరత్, యుగంధర్, సురేష్, శ్రీను, నరేష్, ప్రవీణ్, యాది, అనిల్, పరమేష్, పాషా, కవిత, రోజా, రాజ్యలక్ష్మి, అశ్విని, సింధూజ, కీర్తి పాల్గొన్నారు.

బోనాల పండుగకు సహకరించాలి


రాజేశ్వర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న ముత్యాలమ్మ ఆలయ కుమ్మరి పూజారులు

మహబూబాబాద్ టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలో ఈనెల 3 నుంచి 23 వరకు నిర్వహించే గ్రామ దేవత ముత్యాలమ్మ బోనాల పండుగకు మునిసిపాలిటీ అధికారులు, సిబ్బంది సహకరించాలని ముత్యాలమ్మ ఆలయ నిర్వాహకులు, కుమ్మరి పూజారులు బొడ్డుపల్లి ఉపేంద్రం, పాపయ్య, ఉపేందర్ విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో గురువారం కమిషనర్ టి. రాజేశ్వర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబాబాద్ పట్టణంలోని శిఖార్ ఖానగడ్డ, అంబేద్కర్ సెంటర్‌లోని ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో పారిశుధ్య పనులు వేగవంతంగా చేయాలని కోరారు. బోనాల సమర్పణ అనంతరం వెను వెంటనే శుభ్రం చేసి ఆలయ ప్రాంగణం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి

మహబూబాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి

పనిగంటల పెంపు రాజ్యాంగ వ్యతిరేకం

మహబూబాబాద్ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు పనిగంటల పెంపు రాజ్యాంగ వ్యతిరేకమని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, బిల్లకంటి సూర్యం అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్ నుంచి ఫారెస్టు సెంటర్, నెహ్రూసెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 60 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారని 8 గంటల పనిని 10 గంటల వరకు పెంచడం ఏమిటని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా ఎన్నో కార్మికవర్గ పోరాటాలు జరిగాయని, ఎంతోమంది కార్మికులు తమ ప్రాణాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులంతా ఐక్యంగా ఉద్యమాలు చేపట్టకపోతే పనిగంటల పెంపును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకునే ప్రసక్తే లేదన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏవో పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. అర్వపల్లి వెంకన్న, బానోత్ రాంలాల్, బీకు, శ్రీరాం పుల్లయ్య, లక్ష్మయ్య, వీరన్న, ఉమగాని సత్యం పాల్గొన్నారు.

ఆర్యసమాజ మందిరంలో చతుర్వేద పారాయణం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్యసమాజ మందిరంలో ఈనెల 1 నుంచి 4 వరకు చతుర్వేద పారాయణ యజ్ఞం పూజాకార్యక్రమాలు నిర్వహించబడుతాయని ఆర్యసమాజ ట్రస్టు అధ్యక్షుడు నారాయణ ప్రకాష్‌లోయా గురువారం తెలిపారు. శ్రావణమాసం పురస్కరించుకొని పతంజలి ప్రాణ యోగా ఆరోగ్య సేవకేంద్రంలో లోక కల్యాణార్థం నాలుగు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి 10 గంటల వరకు పూజా కార్యక్రమాలు నిర్వహించబడుతాయని పేర్కొన్నారు. పట్టణంలోని భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని మానసిక ప్రశాంతత, ఆరోగ్యం పొందగలరని కోరారు.

ఆదర్శప్రాయంగా ప్రజా పాలన

● రేషన్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే కోరం


మహిళకు రేషన్ కార్డు మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

బయ్యారం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : దేశానికి ఆదర్శప్రాయంగా రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గురువారం బయ్యారంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన ఎమ్మెల్యే పలువురు లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందజేశారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎన్ని అవరోధాలు సృష్టించినా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ సాధించి తీరుతుందన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారని ఎమ్మెల్యే విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అందిస్తున్న సంక్షేమ ఫలాలతో పేద ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఎంపీవో చంద్రమౌళితో పాటు సొసైటీ డైరెక్టర్లు శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, సీతరామిరెడ్డి, భాస్కర్, కాంగ్రెస్ నాయకులు మునలయ్య, కిషన్ నాయక్, వెంకటపతి, సోమేష్, రామునాయక్, రాంమూర్తి, నాగేశ్వరరావు, రవి నాయక్, సత్తిరెడ్డి, మంగీలాల్, లక్ష్మీ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల వేతనాలు చెల్లించండి

డోర్నకల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డీలర్లకు గత ఐదు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు విడుదల చేయడం లేదని, వెంటనే వేతనాలను మంజూరు చేయాలని రేషన్‌డీలర్లు అన్నారు. గురువారం డోర్నకల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేషన్‌డీలర్లు మాట్లాడుతూ.. గత ఏప్రిల్ నెల నుంచి తమకు వేతనాలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. వెంటనే వేతనాలు మంజూరు చేసి తమను ఆదుకోవాలని రేషన్‌డీలర్లు విజ్ఞప్తి చేశారు.

హనుమాన్ వ్యాయామశాలలో చోరీ

డోర్నకల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని హనుమాన్ వ్యాయామశాలలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వ్యాయమశాల యాజమాని కొత్త రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యాయామశాల వెనుకవైపు ఉన్న తలుపు పగులగొట్టి లోనికి ప్రవేశించి వ్యాయామశాలలోని డంబెల్స్‌తో పాటు ఇతర పరికరాలను అపహరించుకుపోయినట్లు చెప్పారు. చోరీకి గురైన పరికరాల విలువ రూ.10 వేల వరకు ఉంటుందని చెప్పారు. ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రాంబాబు తెలిపారు.

సాహిత్య అభిరుచి కలిగి ఉండాలి

కురవి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సాహిత్య అభిరుచి కలిగి ఉండాలని హెచ్‌ఎం సత్యనారాయణ అన్నారు. కురవి మండలం మొదుగుల గూడెం జడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం సాహితీవేత్త వంశీప్రేమ్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన చిత్రపటం వద్ద నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సత్యనారాయణచారి మాట్లాడుతూ.. వంశీప్రేమ్‌చంద్ మెదస్సు మీద ప్రభావం కలిగించే రచనలు చేశారని, విద్యార్థులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తోట శ్రీరాములు, దీపిక, రజిత, సలీం, విష్ణు, వీరన్న, బలాష్టి రమేష్, రచ్చ వెంకన్న, లక్ష్మి, సునీల్, వీరయ్య పాల్గొన్నారు.

ఆలయాలను నిర్మించుకోవడం అభినందనీయం

తొర్రూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆలయాలను పునఃనిర్మించుకోవడం అభినందనీయమని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. గురువారం తొర్రూరులోని పాటిమీదగల శివాలయ పునఃనిర్మాణ ప్రతిష్ఠాపన కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. భక్తుల కోరికలు నెరవేరే క్షేత్రంగా ఈ ఆలయం రూపుదిద్దుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పునఃనిర్మాణ కమిటీ నిర్వాహకులు పత్తి సమ్మయ్య, భరత్, సోమరాజశేఖర్, పెదగాని సోమయ్య, సురేందర్‌రెడ్డి, రాంచంద్రయ్య, ఆలయ అర్చకులు శేష, శివశర్మ తదితరులు ఉన్నారు.


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఝాన్సీరెడ్డి

వాసవీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు

తొర్రూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శివక్షేత్ర ఇంటర్నేషనల్ పీఠాధిపతి, హిందూధర్మ పరిరక్షకుడు శివస్వామి ఆధ్వర్యంలో గురువారం తొర్రూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిఅమ్మవారికి చీరె, సారె, వడిబియ్యాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ శ్రావణమాసం అంటే వ్రతాలు నోచుకునే మాసం అని, ఈ మాసంలో అమ్మవార్లకు మహిళలు ఎక్కువగా ప్రత్యేక పూజలతో పాటు వ్రతాలు నిర్వహించుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభ ఉపాధ్యక్షులు గౌరీశంకర్, ఆలయ నిర్వాహకులు చలువాది సత్యనారాయణ, నాగేశ్వర్ రావు, కుమారస్వామి, రాంబాబు, గీత, అనుపమ, పద్మావతి ఉన్నారు.

'పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి'

తొర్రూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి ఉత్సవాలు జయప్రదం చేయాలని గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ అన్నారు. గురువారం తొర్రూరులో జయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ బలహీన వర్గాల స్వేచ్ఛ కోసం పోరాడిన గొప్ప వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, బహుజనుల కోసం అహర్నిషలు పోరాడిన మహనీయుడు అని కొనియాడారు. ఆగస్టు 10వ తేదీ హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే జయంతి ఉత్సవాలకు గౌడ కులస్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గోపా డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి రమేష్, చీకటి శ్రీనివాస్, నిమ్మల వెంకన్న, దీకొండ శ్రీను, గోపాల్, యాదగిరి, ఉప్పలయ్య, సదానందం తదితరులు ఉన్నారు.

అవగాహన సదస్సుకు హాజరుకావాలి

తొర్రూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆర్ఎంపీ, పీఎంపీలకు నిర్వహించే అవగాహన సదస్సుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు హాజరు కావాలని ఆర్ఎంపీ, పీఎంపీ జిల్లా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనపురం వెంకన్న అన్నారు. గురువారం తొర్రూరులో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 4వ తేదీన జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారుల సమక్షంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని, ఈసదస్సుకు తొర్రూరు డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల ఆర్ఎంపీలు, పీఎంపీలు హాజరుకావాలన్నారు. హాజరుకాని వారిపై సంఘం నిబంధన మేరకు చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంపీలు కె.యాకయ్య, వెంకటేష్, రాజమౌళి, హనుమంతు, శంకరయ్య, విశ్వనాథం తదితరులు ఉన్నారు.

'సంస్థాగతం'పై సన్నద్ధత ఏదీ?

(5వ పేజీ తరువాయి)

26వ తేదీన నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. అప్పటికే భూపాలపల్లి జిల్లా నుంచి కొత్తగా ములుగు కూడా జిల్లా కేంద్రంగా ఏర్పడింది. దీంతో ఆరు జిల్లాలకు బీఆర్ఎస్ అధ్యక్ష బాధ్యతలను ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీ చైర్మన్‌లకే అప్పగించారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా అరూరి రమేష్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా వినయ్‌భాస్కర్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలిగా గండ్ర జ్యోతి, ములుగు జిల్లా అధ్యక్షుడిగా కుసుమ జగదీష్, జనగామ జిల్లా అధ్యక్షుడిగా సంపత్‌రెడ్డి, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలిగా మాలోతు కవితలను నియమించారు. కేవలం జిల్లా అధ్యక్షులను మాత్రమే అధిష్ఠానం నియమించింది. ప్రధానకార్యదర్శులతో పాటు ఉపాధ్యక్షులు, సంయుక్తకార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, తదితర పదవులను ఎవరికీ కట్టబెట్టలేదు. వీటితో పాటు బీఆర్ఎస్ అనుబంధ సంఘాల కమిటీలు, మండల కమిటీలను కూడా ఏర్పాటు చేయలేదు. అనుబంధ సంఘాల కార్యవర్గాలు లేకపోవటంతో ఆ విభాగంలో పార్టీ క్యాడర్‌ను సమన్వయం చేసే అవకాశాలు లేకుండా పోయిందనే విమర్శలు ఉన్నాయి. మహిళ, రైతు, యువత, విద్యార్థి తదితర కమిటీలు లేకపోవటంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి భారీగా నష్టంవాటిల్లిందనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. కేవలం జిల్లాలో అధ్యక్షులనే నియమించటంతో వారు ఏక్ నిరంజన్‌లుగా వ్యవహరించారు. మూడున్నరేళ్లుగా కార్యవర్గాలు లేకపోవటంతో కార్యవర్గ సమావేశాలు జరిగింది కూడా లేదు. అయితే ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలకు పార్టీ కార్యాలయాలను మాత్రం నియమించారు. కార్యవర్గం లేకుండా కార్యాలయాలను నిర్మించటంతో అవి ఎందుకూ పనికిరాకుండా పోయాయనే విమర్శలు ఉన్నాయి. మరోవైపు గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షపదవికి గత ఏడాది మార్చి 17న రాజీనామా చేశారు. అప్పటి నుంచి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీకి ఆ ఒక్క ఏక్ నిరంజన్ కూడా లేకుండా పోయారు. అయితే 2023 జూన్ 11న ములుగు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న కుసుమ జగదీష్ మృతిచెందటంతో రెండున్నర నెలల్లోనే 2023 ఆగస్టు 30న ఏటూరునాగారానికి చెందిన కె.లక్ష్మీనర్సింహరావును అధిష్ఠానం నియమించింది. కానీ, వరంగల్ జిల్లా విషయంలో పార్టీ అధ్యక్షుడిని నియమించేందుకు తాత్సారం చేయటం క్యాడర్‌లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

స్థానికంలో నెగ్గేదెట్లా..?

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమితో గులాబీ క్యాడర్ డీలా పడింది. ఆ తరువాత 2024 మే 13న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాల్లో ఓటమి గులాబీ శ్రేణులను మరింత కుంగతీశాయి. వీటికి తోడు జూలై జరిగిన వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో పార్టీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి ఓటమితో బీఆర్ఎస్ సైలెంట్ అయింది. వరుసగా మూడు ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో గులాబీ పార్టీ వరుస ఓటములు క్యాడర్‌లోనూ నిరుత్సాహం పెరిగింది. కీలకనేతలుకారు దిగి హస్తం గూటికి చేరటంతో మరికొంత ఆందోళనలో గులాబీ క్యాడర్ ఉంది. ఈ క్రమంలోనే స్థానిక ఎన్నికలపై ప్రభుత్వం కసరత్తు చేస్తుండటంతో గులాబీ శ్రేణుల్లో టెన్షన్ మొదలైంది. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయటంపై అధిష్ఠానం దృష్టిపెట్టడం లేదనే ఆవేదనలో కార్యకర్తలు ఉన్నారు. గ్రామస్థాయిలో అభ్యర్థులను నిలిపి ప్రచారంచేయటంతో పాటు గెలుపుకోసం వ్యూహరచన చేసే పార్టీ జిల్లా, మండల, గ్రామ అధ్యక్షులు లేకపోవటంపై క్యాడర్‌లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీలు సంస్థాగతంగా పార్టీలను బలోపేతం చేసేందుకు కసరత్తు చేస్తున్నాయి. బీజేపీ వార్డు, బూత్, గ్రామ, మండల, జిల్లా కమిటీలను కూడా ప్రకటించింది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీలను ప్రకటించేందుకు కసరత్తు చేస్తోంది. వచ్చే నెలలో అన్ని కమిటీలను వేయాలని కాంగ్రెస్ కార్యాచరణ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్‌లో మాత్రం సంస్థాగత సందడి లేకపోవటంపై క్యాడర్ లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఒక్క జనగామ సెగ్మెంట్‌లో మినహా బీఆర్ఎస్‌కు ఎమ్మెల్యేలు లేరు. మిగతా అన్ని చోట్ల మాజీలే దిక్కయ్యారు. ఎన్నికల్లో క్యాడర్‌కు ఖర్చులను కూడా సర్దుబాటు చేసే నేతలు లేకపోవటంపై ద్వితీయ శ్రేణి నేతలు ఆందోళనలో ఉన్నారు.

ఇన్‌చార్జి బాధ్యతలకే కొట్లాట

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ నేతలు తమకు పదవులు కావాలనే అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారని, పార్టీ బలోపేతం చేసేలా కమిటీలను వేయాలనే ప్రతిపాదనలు చేయటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. భూపాలపల్లి నియోజకవర్గంలో ఇన్‌చార్జి పదవి కోసం ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిల పోటీ తీవ్రమవుతోంది. దీంతో ఏకంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను తీసుకువచ్చి నియోజకవర్గ ఇన్‌చార్జిగా గండ్ర పేరును ప్రకటించేలా చేసుకున్నారు. అయినప్పటికీ ఇక్కడ వర్గపోరు ఆగేలా లేదు. గురువారం సిరికొండ మధుసూదనాచారి భూపాలపల్లి కోల్‌బెల్ట్‌లో పర్యటించటం చర్చనీయాంశంగా మారింది. అలాగే వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పదవిపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిలు పోటీపడ్డారు. కేసీఆర్ ఇద్దరు నేతలను కూర్చోబెట్టి దయాకర్‌రావుకు బాధ్యతలు అప్పగించాల్సి వచ్చింది. అలాగే ఇదే లొల్లి మహబూబాబాద్, డోర్నకల్, స్టేషన్‌ఘనపూర్, వరంగల్‌లో నెలకొంది. నేతలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించే విషయంలో అధిష్ఠానం వేగంగా స్పందిస్తోందని, జిల్లా కార్యవర్గాల నియామకంపై దృష్టి పెట్టడం లేదనే ఆందోళనలో గులాబీ శ్రేణులు ఉన్నాయి. తమకు పదవులు లేకుంటే స్థానిక సంస్థల్లో నిలిచేది ఎట్లా..? గెలిచేది ఎట్లా..? అని గులాబీ క్యాడర్ ప్రశ్నిస్తోంది. ఇప్పటికైనా గ్రామ స్థాయి నుంచి పార్టీని సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసి, స్థానిక సంస్థలను ఎదుర్కొనేలా అధిష్ఠానం దృష్టి పెట్టాలని కార్యకర్తలు కోరుతున్నారు.


సబ్‌స్టేషన్‌తండాలో తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న మురళీనాయక్

గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీక తీజ్ పండుగ

● మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : తీజ్ పండుగ లంబాడీ గిరిజనుల సాంస్కృతిక ఆత్మగౌరవానికి ప్రతీక అని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలోని సబ్‌స్టేషన్‌తండాలో గురువారం సాయంత్రం యూత్ కాంగ్రెస్ నాయకుడు బాదావత్ పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, ధరావత్ బాలు, గుగులోత్ రాము పాల్గొన్నారు.

శ్రీరామలింగేశ్వర స్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

నెల్లికుదురు : మండల కేంద్రంలోని నూతనంగా నిర్మించిన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ మహోత్సవానికి ఎమెల్యే మురళీనాయక్ హాజరై మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్థులు సుఖసంతోషాలతో జీవించాలని పాడిపంటలు అభివృద్ధి చెందాలని స్వామివారిని వేడుకున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

డీసీసీబీలో అధిక వడ్డీతో కొత్త పథకాలు

కేసముద్రం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా సహకార కేంద్రం బ్యాంకు కేసముద్రం బ్రాంచీలో అంతర్జాతీయ సహకార సంఘాల సంవత్సరం-2025 సందర్భంగా ఇతర బ్యాంకుల కంటే అత్యధికంగా 8.4శాతం వడ్డీతో డిపాజిట్ పథకం అమలు చేస్తున్నామని ఆ బ్రాంచి మేనేజర్ చైతన్య తెలిపారు. కేసముద్రంలో గురువారం ఆమె మాట్లాడుతూ వ్యవసాయ భూమిని తాకట్టుపెట్టుకొని విద్యార్థులకు ఉన్నత విద్య కోసం రుణం ఇచ్చే ఏకైక బ్యాంకు తమదేనని తెలిపారు. ఈ బ్రాంచిని త్వరలో కేసముద్రం మార్కెట్ యార్డులోని ఆవరణకు మారుస్తున్నట్లు తెలిపారు. మొబైల్ బ్యాంకింగ్, గూగూల్ పే, ఫోన్ పే, లాకర్ సౌకర్యం అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నెహ్రూసెంటర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ రామంతపూర్ పబ్లిక్ స్కూల్‌లో అడ్మిషన్ల కోసం గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా నుంచి 3 బాలుర, 3 బాలికల సీట్లు ఉన్నాయని, వాటి కోసం ఆగస్టు 1 నుంచి 8వ తేదీ వరకు సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు చెప్పారు. 11న ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన 1వ తరగతి ఇంగ్లీష్ మీడియం కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 1 జూన్ 2018 నుంచి 31 మే 2019 లోపు జన్మించిన వారు అర్హులన్నారు. సంబంధిత ధ్రువపత్రాలతో గిరిజన సంక్షేమ కార్యాలయం మహబూబాబాద్ నందు సమర్పించాలన్నారు.

భోజన కార్మికులకు బిల్లులు చెల్లించాలి

● ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న

కేసముద్రం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న డిమాండ్ చేశారు. మండలంలోని తాళ్లపూసపల్లి, గాంధీనగర్, కల్వల పాఠశాలల్లో ఆ సంఘం ఆధ్వర్యంలో భోజన కార్మికుల సమస్యలను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ఆరు నెలలుగా భోజన బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఆర్థికంగా కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వంట కోసం ఉచిత గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ధరావత్ రమేష్, కార్మికులు యాదమ్మ, టి.స్వాతి, తేలుకుంట్ల రజిత, ఎల్లె శోభ, కత్రోజు శ్రీలత, జి.సుజాత, ఎస్.జ్యోతి, కుంట లక్ష్మి, గాడిపెల్లి లలిత పాల్గొన్నారు.

సమగ్ర విచారణ లేకుండా తప్పుడు కేసులు సరికాదు

● ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భీమానాయక్

నెహ్రూసెంటర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర విచారణ లేకుండా తప్పుడు కేసులు బనాయించడం సరికాదని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమానాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం తన బృందంతో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో ఓ నిండు బాలింత మృతి చెందిందని, వారి కుటుంబానికి న్యాయం చేయాలంటూ పోరాటం చేసినందుకు తనపై తప్పుడు కేసులను బనాయిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపించాలని, ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల ద్వారా నిజనిజాలు తెలపాలన్నారు. ఓ నిండు బాలింత మృతికి కారణమైన వైద్యుడిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పోరాటం చేసిన వారిపై తప్పుడు కేసులు బనాయించడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే ఎఫ్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బోడ రమేష్‌నాయక్, బానోత్ రాందాస్‌నాయక్, గుగులోతు మంగీలాల్‌నాయక్, మూడు సోమునాయక్ పాల్గొన్నారు.

ఓసీ క్లబ్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

(5వ పేజీ తరువాయి)

చేసుకోక పోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆగస్టు 4న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతామని తెలిపారు. ఈ దీక్షలో పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వెలుగు శ్రావణ్, మేక వీరన్న, అశోక్, చిరంజీవి, తోట రాజకుమారి, మంద శంకర్, ఎర్రోజు పద్మ, వెంకన్న, కూరాకుల పాల్, రవిచంద్రబోస్, ఎమ్డీ. షంషీర్, అలీమా, మెతుకు కుమార్, రమేష్ కూర్చున్నారు.